# ఇదీ నా కత

ప్రఫుల్ల చంద్ర

14—4—82

ఈ సదూకున్న పెద్దోల్లంటే నా కొల్లు మంట. ఆల్లకి బుద్ధి లేదు.

ఇంతకూ ఇది సదూతున్న మీరు పెద్దోల్లా? నాలాగ యువతరం పెతినిదులా?

మీ రెవరైనా నాకు భయం లేదు. నిజంగా నిజం సెప్పడాన్కి భయం ఎందుకంట?

బ్రెమ్మానంద రెడ్డి దర్మమా అని పిల్లగాల్లు పరీచ్చల్లో మార్కులు రాకపోయినా—పాస్ అయిపోతున్నారా ఇంచెక్కా? మరి ఈ పెద్దోల్ల కేం పోయే గాలం వచ్చిందని గోలెడతారు! పిల్లగాడు పాస్ అవడం ఎలాగా అని ఆలోసించకుండా—పరీచ్చలు కస్టం గుండాలి, పెద్ద పెద్ద పుస్తకా లెట్టాలి—అని యాగీ సేస్తా రెందుకు? వీల్లకు బుద్ధి ఉందా?


ఈ పద్దతి ఎంత మందిని సుక పెట్టింది?

మాస్టార్లు పాటాలు సెప్పడం మానేసి టేబుల్ మీద (టేబులే అంటూ ఉంటే) కాల్లెట్టుకుని సుకపడుతున్నారు. పిల్లలేమో స్కూలు మొగం సూడకుండా మాటినీ, మార్నింగ్ సో సినిమాల కెల్లి సుకపడుతున్నారు. స్కూలు కెల్లకపోయినా, హాజరేసి పబిలీకు పరీచ్చల్లో పిల్లగాల్లకి కాపీలు అందించి సాయం చేస్తున్నారు మాస్టార్లు. ఏదో మేమిలా సర్దుబాటు సేసుకుని సుకపడుతోంటే కల్లు కుట్టిన కిట్టనోల్లు గోల సేస్తున్నారు.

ఇలా గోల సేసే పెద్దోల్లకు నిజంగా పెజాసామ్యం అంటే ఏటో తెలీదు. పది మందిని సుక పెట్టేదే పెజాసామ్యం నేటి విజ్యా విధానంలో ఎంత మంది సుకపడుతున్నారో సూసి అసూయతో యీల్లు గుండెలు బాదుకుంటున్నారు—విజ్యా పెమాణాలు దిగజారిపోయాయంటూ.

ఇదే సదవాలి. ఇది సదవకూడదు. జుట్టు ఇంతే పెంచాలి. ఇలాంటి బట్టలే తొడగాలి—అంటూ అన్ని యిసయాల్లోనూ సంక్కు దర్బార్లు ఆడ్డర్లు జారీ సేసే యీల్లు—ఈ పెద్దోల్లు—నిజంగా డిటేటర్లు. ఈ నియంతం మీద నాలాంటి యువ తరం పెతినిదులు తిరుగుబాటు సేయాలి.

నాకు సదవడం, రాయడం వచ్చు. గైడులో ఏ ప్రెస్నకి ఎక్కడ జవాబుందో తెలుసు. ఇట్నే సింపి జాగర్తగా పరీచ్చలో కాపీ సేయడం వచ్చు. ఇన్ని సేతనైన నేను ఎందుకూ పనికిరానని మా నాన్న తిట్టేవోడు. ఒక చాదస్తం ముసిలి పంతులు—నా పొట్ట కోస్తే అచ్చరం ముక్క లేదని తిట్టిపోసేవోడు. ఆయన తెలివి గాని, పొట్ట కోస్తే అచ్చరం ముక్క ఎందుకుంటది? అదేమన్నా ఇడ్డూ ముక్క కనకనా? పొట్ట కోస్తే పేగు లుంటాయని తెలీని ఆ పంతులు పెద్ద గ్నానిలా పోజు పెడతాడు. ఎంత సేపూ హరిచంద్రుడు, సీరాముడు కతలు సెబుతాడు. ఈ రోజుల్లో హరిచంద్రుడిలా ఎవరైనా పెల్లాన్ని అమ్మేస్తే—అమ్మిన, కొన్నవోడ్నీ జైలులో తోసేత్తారు. సీతారాముడులా సెప్పిన మాటలు యిని పెల్లాన్ని ఒగ్గేత్తే ఆన్నీ జైల్లో సెరేత్తారు. లేకపోతే ఇండాకు లిచ్చేత్తారు. ఈ విసయాలు తెలీని ముసలి పంతులు ఎప్పుడూ అవే కతలు సెబుతాడు. నిజం సెప్పండి మీరు...ఇదేం నాయం?



పదో క్లాసు పబ్లీకు పరీచ్చలో నాకు వచ్చిన వాకర్లందరూ ప్రెశాపాన్యం తెలిసినోల్లు. ఒకడు బిట్టు ప్రెస్నలకి జవాబులు సెప్పేసేడు. మరొకడు గైడ్సు అందించాడు. ఇంకొకడు తనే కాగితాలమీద జవాబులు రాసి అందరికీ పంచాడు. టాట్ అలా ఈల్లేదన్న పెశాపాన్యం తెలీని మూలక్కడ తన్నులు తిని పోయాడ.

అయితే నేను ఈల్ల దయా దాచ్చిన్నంమీద ఆదారపడలేదు. క్రుసి ఉంటే మనుసులు రుసులు అవుతారు అండ్ మహా పురుసులు అవుతారని మా గురూగారు సెప్పేరు కదా! అందుకే రాతిరి తెల్లవార్లూ మేలుకునుండి పీమ తలకాయ లాంటి అచ్చరాలతో స్లిప్పులు తయారుసేసి అటిని పేంటు మడతల్లో, జుట్టు మద్య, బూటుల్లో మహా నైపుణ్యంగా దాచి, వాచరు కంట్లో పడకుండా అస్త లాగవంతో—అర్జునుడు మచ్చి యంత్రం కొట్టినట్టు నేను కాపీ కొట్టాను.

నా స్వయంక్రుసి, నైపున్యం సూసి మా నాన్న సంతోషించలేదు సరికదా తిట్టాడు. మనసిలి సంతులేమో డంగ్ అయిపోయాడు—ఆయన అబిమాన సిస్యుడు రామునన్నా నా కెక్కువ మార్కు లొచ్చాయని! ఉడికి పోయి గోల పెట్టాడు నేటి విజ్యా విదాన గోరంగా తగలడి పోయిందని!

మీరే నాయం జెప్పండి. బట్టీపట్టి పరీచ్చలు రాసే రాముకన్నా నాకు నైపున్యం, తెలివి ఎక్కువ లేవా? కాని, ఆడికి బుద్ధిమంతుడని పేరొచ్చింది. నాకేమో రవుడీ ఎదవని పేరొచ్చింది. కస్టమైన పద్ధతి మాని సులబ పద్ధతిలో పాస్ అయిన నన్ను సూసి సంతోసించక తిట్టడం ఏం నాయం? ఈ పెద్దలకు బుద్ధి ఉందా?

అంతెందుకు? రాము సర్టిఫికేటు, నాది మీసేతి కిత్తా. నా దానిలో—యిది కాపీ సర్టిఫికేటు—అని ఎక్కడైనా ఉందేమో సూసి సెప్పండి.

ఎలాగైతేనేం, డిగ్రీ సంపాదించానండీ. పస్టు క్లాసు డిగ్రీ.

ఇక ఉజ్జోగం ఏట.

ఉజ్జోగం యిచ్చే ముందు యింటర్వ్యూ అని ఒకటే డిసింది మరి. ఇంటర్వ్యూ అంటే లోపలికి సూడ్డం అని కదా అర్థం? ఈల్లు మరి మనిసి లోపలికి ఎలా సూస్తారు సెప్పండి? సూత్తే మాతరం అందరు మనుసులకీ ఒకేలాగ గుండె కాయ, వూపిరితిత్తులు, పొట్ట, మలం, మూతరం ఉంటాయి కదా! మరి యీల్లు దేన్ని సూసి ఉజ్జోగం యిత్తారు?

నా కనిపిత్తోంది—ఇంటర్వ్యూ అంటే కావలసినోడికి ఉజ్జోగం ఇచ్చి, మిగిలిన వాల్లకు నామం ఎట్టడానికి సిటకా యీ యింటర్వ్యూ. లేకపోతే ఆల్లు అడిగే ప్రెస్నలకి, యిచ్చే ఉజ్జోగానికీ ఏటి సంబందం?

ఒక యింటర్వ్యూలో ఒక డడిగాడూ—''ఇందర గాందీ ఎవరు?'' అని.

టక్కున సెప్పేసినా—''గాందీ గారి పెల్లాం'' అని.

ఎర్రిమొగం ఏసాడాయన. ''ఏ గాందీగారూ?'' అని అడిగాడు. సూసారా ఆడి తెలివి? గాందీ గారెవరో ఆడికి తెలీదు. ఆడూ నన్ను ప్రెస్న లడగడం !

మరొకాయన అడిగాడు—''అబ్రకదబ్ర అంటే ఏమిటని.''

నీ దిబ్బ—అందామనుకొని, మరియాదగా ఉండదని ''అబ్రకం దొరికే ఒక దిబ్బ'' అని సెప్పా. ఈసారి ఇందీ గ్నానం మీద ఒక ప్రెస్న ఏసాడు. ''తుమ్ ఆవో—అంటే ఏటి?'' అని.

''తుమ్ము వచ్చింది'' అని టకీమని సెప్పా.

పెతీ యింటర్వ్యూలో నేనిలా చెడుగుడు ఆడేసా. టెన్నిస్ ఆడేసా. కాని, ఎవడూ నా కుజ్జోగం యివ్వలేదు. పైగా ముసి ముసి నవ్వులు. మీరే సెప్పండి—నా జవాబుల్లో తప్పు ఏమన్నా వుందా?

అయ్యా యిదండీ యింటర్వ్యూ సేసేవాల్ల బాగోతం. ఇంతకూ అడిగ్నేవొడికి సెప్పేవొడు లోకువ. నన్నా కుర్చీమీద కూకోబెట్టండి. నేనూ అడుగుతా. ''మా ఈదిసివర కూకునే ముస్టివాడి సరీరం మీద పుల్లు ఎన్ని? నోట్లోని పల్లెన్ని? అండ పిండ బ్రెమ్మాండంలో అంబోతు రంకె ఏత్తే అక్కడ తగులు, ఇక్కడ తగులు. కుడి పిర్రకు తగులు. బోడి బుర్రకు తగులు—ఏటది?'' యిలా ప్రెస్నలు గుప్పిత్తే ఆల్లుమాతరం సెప్ప

ఊరగాయల కాలం వచ్చేసింది
ఊరగాయలన్నింటికి 'అగ్‌మార్క్'
A.S బ్రాండ్ పప్పునూనె
మాన్షన్ బ్రాండ్ నువ్వులనూనె
లనే వాడండి.

★ 70 సంవత్సరాలనుండి మహిళాలోకం విశ్వాసాన్ని చూరగొన్నది..............
★ సంవత్సరం అంతా ఘుమఘుమ లాడుతూ ముక్కని మెత్తబడనీయకుండా ఊరగాయని రుచికరంగా వుంచుతుంది............
★ అన్నివంటలకు శ్రేష్ఠమైనది.




తయారుచేయువారు:
అంబటి సుబ్బన్న & కో. సామర్లకోట.

బ్రాంచీలు : 1) డా. పుల్లక్కస్ట్రీటు, తెనాలి Phone : 150.
2) 1-3-166 రాజామొదలియార్ స్ట్రీటు, కలాసిగూడా సికింద్రాబాద్ Phone : 76160.
బళ్ళారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగ్‌పూర్‌లలో మా ఏజంట్లు కలరు.

గలరా?

ఇలా రెండేళ్లు కుస్తీ పట్టినా, ఉద్యోగం దొరకలేదు. ఒక పదేలు పారేత్తే ఈ బుద్ధిమంతులు, ఈ తెలివిగలోల్లు, ఈ పెద్దోల్లు—ప్రెస్నలు మాని ఉద్యోగం లటుక్కున యిచ్చేత్తారు. అవిడే ఉంటే హొటల్ అవడ ఎందుకు అంత డబ్బే ఉంటే ఉద్యోగం ఎందుకు?

నన్ను నిరాస, నిస్స్పృహ, నిస్సహాయత నికరంగా కాటేసినాయి. డీలాపడిపోయాను. డస్సిపోయాను. డల్లు అయిపోయాను. పెట్టా పుట్టా పట్టుకు తిరిగాను. ఈదీ ఈదీ నాదే అని పాడినాను. సాయంకాలం పార్కులకి కూలబడి ఆలోసించేవాన్ని.

బతకడాన్కి ఉద్యోగమే సేయాలా? ఎన్ని వ్యాపారాలు లేవు? ఆలోసించాను. ఆలోసించాను.

పార్కులో నేను కూకునే టయానికి కొంచెం అటూ యిటూగా, నా స్తలానికి కొంచెం ముందు ఎనకగా ఒచ్చి కూకునేది ఒకమ్మాయి. అమ్మాయి అనేకంటే దాన్ని.., దాన్ని ఏనుగు పిల్ల అనడం నాయం. అంత లావు, నలుపు. దనవంతురాలు లాగ కనిపించింది.

ఆమె సూపులూ, నా దగ్గరగా కూకోడం సూస్తే దానికి నామీద మోజు కలిగినట్టే తోసింది నాకు. నా విసాల హ్రుదయం మరింత సాగిపోయి గోల హొట్టేసింది. నాది యంటీఆర్ పెరసనాలిటీ. ఆయస్కాంతంలా ఆడదాన్ని ఆకర్సించేయనూ మరి! నా మీద దానికి మోజు కలగడం నాయమే.

నేను యువతరం ఆసాజ్యోతిని. నవతరం నందిని. నాలాటోడు ముందడుగేసి అలాంటి అనాకారి పిల్ల చేయి పట్టకపోతే దాన్ని ఎవరు పెల్లి సేసుకుంటారు? దాని జలమ పండి, ఎండి, రాలి, కాలిపోవలసిందేనా? అని నా గుండె జాలి వాన కురిసేసింది. ఎదవది నా గుండెనిండా గుండిగల కొద్దీ జాలి పూరిపోతా వుంది.

అదిగో ఇప్పుడు...అప్పుడే...

బుద్దుడుకి బోదరుచ్చం కింద (రుచ్చం అంటే చెట్టు అవి నాకు తెలుసు. కాని, మనుసులకు కాక మానులకు ఒస్తదా బోదరోగం? మరి పెద్దోల్లు బోదరుచ్చం అని రాసేరాం? ఇదిగో యిలాగే ఉంటాయి పెద్దోల్ల బుద్దులు!) బుద్దుడికి బోదరుచ్చం కింద గ్నానోదయం అయినట్టు ఆ గజ లచ్చిమిని సూడగానే నాకు గ్నానోదయం అయింది.

మన పయిత్ర బారద్దేశంలో సగానికి సగం మంది అమ్మాయిలే కదా! వారిలో కొంత మందయినా గుడ్డి, కుంటి, సొట్ట, కోతి—ఉంటారు కదా! ఆ కొంత మందిలో మరి కొంత మంది దనవంతులై ఉంటారు కదా. అమ్మాయికి లోపం ఉందంటే ఎవరూ పెల్లిసేసుకోరుకదా. కానీ, అలాంటి డబ్బున్న కుంటి, గుడ్డి, అనాకారి అమ్మాయిల్ని సేసుకోడాన్కి నిరుద్యోగ పట్టబద్రులు ముందు కురకాల. అప్పుడు నిరుద్యోగ సమస్య కొంత తీరుతుంది. అందం దిబ్బరొట్టి లాంటిది కాదుకదా—కొరుక్కు తింటానికి.

పార్కులో నా పక్కనే కూకునే గజలచ్చిమి అమ్మాయే కదా! దాని కొక మొగుడు కావాలి కదా! మొగుడంటే మగాడు కదా! నేను మగాడినే కదా! అందులో సందేహం లేదు కదా! అందువల్ల నేను గజలచ్చిమిని పెళ్ళి చేసుకుంటే...

గ్నానోదయం బల్బులాగ ఎలగగానే పాచిక ఏసాను. పాచిక పారింది...

మా పెళ్ళికి వచ్చిన నా స్నేహితులంతా "సీ" అన్నారు. ఈ సీసాలతో నాకేటి లెక్క? నాది ఇసాల హృదయం. ఎన్ని సీసాలైనా పడుతుంది.

ఈ విధంగా నేనొక సూజీ ఎం. ఎల్. ఎ. అల్లున్ని అయాను. పెజాసేవలో తరిబీదు పొందాను.

పదవి లేకపోయినా, పెజాసేవ సేయడంలో మా మావ అకండుడు. ఆయనకు అయిదరాబాద్‌లో అందరూ తెలుసు. నీకే పని కావాలన్నా—డబ్బు మూటట్టుకుని మా మావ కాడికి రా వెంటనే నీ పని జరుగద్ది.

ఇది నికార్సయిన పెజాసేవ కాదా? మరి కొందరు పెద్దోలు అవినీతి, లవినీతి అని గోల పెడతా ఉంటారు. అలా గోలపెట్టే ఆల్లు కూడా


ఇంటి సినిమా యంత్రం
(SILENT MOVIE)
ధర రూ. 150



సినిమా ఫిలిం రీల్సు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2-50 కు పోస్టేజి స్టాంపులు పంపండి. ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

ఉత్పత్తి దారులు:
FILM COMPANY
(Established 1967)
Post Box No. 269
3, Thillaichidambara Nadar Street,
SIVAKASI-626123 Tamilnadu.

తెలుగులో అపూర్వమైన
అంబడిపూడి పుస్తకాలు
అద్భుతాలను సాధించండి
విజయవంతంగా జీవించండి
మోహినీ శక్తి
చేతబడులు, పెట్టుడు మందులు, వశీకరణం, ఆకర్షణ శక్తి, క్షుద్రశక్తి, దెయ్యాలు, భూతాల రహస్యాలు రూ 10/-
తాంత్రిక శక్తి - రూ. 10/-
ధనద యోగం - రూ. 10/-
ఇతరుల ప్రయోగాల్ని ఎదుర్కోడానికి అద్భుతశక్తులు సాధించడం
కోరికలు తీరడానికి
నూరు మంత్రాలు - రూ. 4/-
హిప్నాటిజం రూ 5/-
హిప్నాటిజం ప్రయోగం రూ. 10/-
హిప్నాటిజం సాధన - సమ్మోహన శక్తి ప్రయోగ రహస్యాలు.
సంకల్పబలం - 1 వ భాగం 5/- రూ
సంకల్పబలం - 2 వ భాగం 10/- రూ
మీరూ మీ శక్తి — 10/- రూ
పిరమిడ్స్ శక్తి - రూ 10/-
గెలుపు నీదే రూ 5/-
రేపు నీదే రూ 5/-
సంతోషంగా జీవించండి రూ 5/-
అరచేతిలో వైకుంఠం రూ 5/-
లక్షలు సంపాదించడమెలా రూ 5/-

డబ్బు మూటకట్టుకుని మా మామ కాడికి ఒస్తా ఉంటారు. అదీ సిత్రం.

* * * *

“. . .ఓ నా ప్రజలారా! మనది పవిత్ర భారద్దేశం. మన దేశంలో పవిత్ర గంగ ప్రవహిస్తా ఉంది. మరే దేశంలోనూ గంగ మా తల్లి ప్రవహించడం లేదు. అందువల్ల మనది గొప్పదేశం. ఆ గొప్ప దేశంలో, ఆ పవిత్ర దేశంలో, గంగ ప్రవహించే మన దేశంలో... ఓ నా ప్రజలారా!... మనం జీవిస్తున్నాం. మన దేశం అన్నపూర్ణ. అన్నం పండే దేశం. ఈ దేశంలో... ఓ నా ప్రజలారా! ఎందరో మహా నాయకులు పుట్టారు. మీ సేవ చేసుకుని తరించాడు. ఆరు సూపిన దోవన నేనేమో మీ సేవ సేసుకుందామని, సేవ సేసుకుని తరిద్దామని తహతహ లాడిపోతున్నా. మీ బాధల్ని, సమస్యల్ని కష్టాల్ని, నష్టాల్ని నా సేతిలో పెట్టండి. నా నెత్తి మీద పెట్టండి. ఆటిని తీరుత్తాను. ఓ నా ప్రజలారా! నేను సెప్పబోయేదేంటంటే... సెప్పేదేంటంటే... ఓ నా ప్రజలారా!... మరిసిపోయాను. సమించాల. నేను మొదటి నుండీ స్వయంకృసితో పైకి వచ్చినోన్ని. ఉపన్యాసం ముందుగానే సీటీ మీద రాసుకుని టోపీలో పెట్టుకున్నా. మీరు అనుగ్న ఇత్తే టోపీలోని సీటీ తీసి చదువుతా... ఎక్కడ ఉన్నాం? ఆఁ ఓ నా ప్రజలారా! కలట్టర్ కొడుకు కలట్టర్ కాకపోవచ్చు. డాటర్ కొడుకు డాటర్ కాకపోవచ్చు. కాని మన ఈ పవిత్ర భారద్దేశంలో నాయకుని కొడుకు నాయకుడే అవుతాడు. ప్రజా సేవకుని కొడుకు ప్రజా సేవకుడే అవుతాడు. కొడుకు లేకపోతే కూతురు, అల్లుడు, పెళ్ళాం... ఎవరో ఒకరు ఆ లోటు బర్తీ సేసి ప్రజాసేవ సేసుకుని తరిత్తారు. మా మామ గారికి కొడుకులు లేరు. అది నా అదృష్టం! నా రగతంలో ప్రజాసేవ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిత్తోంది. నా రగతంలో కద్దరు టోపీలు తెప్పల్లా తేలుతున్నాయి. ఓ నా ప్రజలారా! మీ సేవ సేసుకోడానికి నేను సరుపంచుగా నిలబడుతన్నా. నన్నిప్పుడు సరుపంచుగా ఎన్నుకోండి. ఆ తరవాత ఎం. ఎల్. ఏ., గా ఎన్నుకునే అవకాశం మీకు కలిగిస్తానని సవినయంగా మనవి సేసుకుంటా. ఆ తరవాత నేను మంత్రినయి మన గ్రామాన్ని ఎంత అభివృద్ధి సేస్తానో మీరే సూద్దురు గాని. దున్నే వాడిదే భూమి అయింది. ఇక నుండీ ఉండే వాడిది ఇల్లు. నాటే వాడిదే చెట్టు. వండే వాడిదే తిండి. తొడుక్కునే వాడిదే సొక్కా. ఇప్పుడు ఇంటింటికీ ఒక బల్బు, వీధి వీధికీ ఒక కులాయి ఉన్నాయి. నన్ను ఎన్నుకుంటే ఆ బల్బు ఎలిగేటట్టు సేస్తా. కులాయిలోంచి నీళ్ళు ఒచ్చేటట్టు సేస్తా. ఇక నుండి ప్రతి వోడికీ ఒక డిగ్రీ, ప్రతి వీధికీ ఒక సినిమా, ప్రతి ఇంటికీ ఒక కారు వచ్చేటట్టు సేస్తా. తరవాత అందరూ అనాకారి అమ్మాయినే కనేటట్టు రాజ్యాంగాన్ని సవరిద్దాం. ఆ అమ్మాయిలను పెళ్ళాడి నిరుద్యోగం సమస్య తీసి పారేద్దాం. ఏడో క్లాసు, పదో క్లాసులకు పబ్లిక్కు పరీచ్చ లేకుండా సేస్తా. పరీచ్చల్లో కాపీ సేసే నైపుణ్యం పెంచడానికి ప్రత్యేకంగా మాస్టర్లను నియమిస్తా. కనుక ఓ నా ప్రజలారా! నన్నే సరుపంచుగా ఎన్నుకోండి...!”

* * * *

ఇదిగో ఎడిటరూ — మా మామగారి సీటికా పని సేసి నేను సరుపంచుగా ఏకగ్రీవంగా ఎన్నికైనా. ఇదంతా మా మామ వలన. ఇంతకీ ఆయనెవరో నీకు సెప్పలేదు కదూ? నీకు తెలిసినోడే— బులేనా.

నేను బులేనా గారి అల్లుణ్ణండీ. నా ముందు బంగారు భవిస్యత్తు తలుపు తెరుసుకుని ఎదురు సూస్తా ఉంది. నేను సరుపంచుని కదా! నా కత అందరూ సదూకోవాలి కదా! అందుకని ఇది రాశాను. ఇదీ నా కత. నా అనుబవాలు. ఈటిని సెపు చేసి మంచిగా రాసి — నేనొక యువతరం ఆశాజోతి, నవతరం నంది — అయినట్టు పొగడుతూ రాసి నీ పత్రికలో ప్రచురించుకో. లేకపోతే మా మామ బులేనాతో సెబుతా. నీకు ప్రకటనలు రాకుండా సేత్తా. కాగితం అందకుండా సేత్తా. జాగ్రత్త.

అన్నట్టు ఈ సివరి ముక్కలు ఏసుకోకు—కొంప మునుగుద్ది. *

